జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | బుధవారం 28 జనవరి 2026 | సంపుటి : 1 | సంచిక : 28 | వెల: రూ.5 | పేజీలు: 08

RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

# నేటి నుంచే మేడారం మహాజాతర

- సాయంత్రం గద్దెలపైకి చేరనున్న సారలమ్మ
- భారీ సంఖ్యలో తరలివస్తున్న భక్తులు..
- ఇప్పటికే 45 లక్షల మందికి పైగా మొక్కులు
- పూజారులు ఆదివాసీ సంప్రదాయ ప్రకారం సారలమ్మను కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలపైకి తెచ్చే ప్రక్రియ మొదలవుతుంది



వరంగల్ /మహబూబాబాద్

తెలంగాణ కుంభమేళా, ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర అసలు ఘట్టం కొన్ని గంటల్లో మొదలు కానుంది. కోరిన కోర్కెలు తీర్చే వనదేవత సారలమ్మ బుధవారం సాయంత్రం మేడారంలోని గద్దెపై కొలువుదీరనుంది. మేడారం సమీపంలోని కన్నెపల్లిలో ఉన్న సారలమ్మ గుడిలో మంగళవారం ప్రత్యేకంగా మొక్కు లు చెల్లించారు. పూజారులు ఆదివాసీ సంప్రదాయ ప్రకారం సారలమ్మను కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలపైకి తెచ్చే ప్రక్రియ బుధవారం ఉదయం నుంచి మొదలవుతుంది. సాయంత్రం 6 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ తర్వాత కన్నెపల్లి నుంచి పూజారులు, జిల్లా అధికారులు సారలమ్మను తీసుకొస్తారు. సారలమ్మ గద్దెపైకి వచ్చే లోపు ఏటూరునాగారం కొండాయిలో కొలువైన గోవిందరాజులు, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైన పగిడిద్దరాజును మేడారం గద్దెలపైకి తీసుకొస్తారు. సమ్మక్కను వివాహం చేసుకునేందుకు పగిడిద్దరాజు మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామంలో పెళ్లి కుమారుడిగా ముస్తాబై మంగళవారం మేడారం బాటపట్టారు. అత్తగారిల్లు మేడారం వెళ్లేందుకు సమ్మక్క వంశీయులు పగిడిద్దరాజు వంశమైన పెనక వంశీయులకు -

# ఆ పెద్దాయన కేసీఆరేనా?



- రాధాకిషన్‌రావు చెప్పింది ఆయన గురించేనా?
- అధికారులతో కేసీఆర్ మాట్లాడాలంటే మీరేం చేసేవారు?
- సీఎంవో నుంచి ఫోన్ నంబర్లున్నచిట్టీలు మీరే పంపారా?
- ఎస్ఐబీలోని చాలామందితో నేరుగా ఎందుకు మాట్లాడారు?
- సంతోష్‌రావుపై సిట్ ప్రశ్నల వర్షం
- కేసీఆర్‌ను టార్గెట్ చేసుకుని ప్రశ్నలు



## ఇంధన రంగంలో అద్భుత అవకాశాలు

- 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టొచ్చు
- ఈ దశాబ్దం ఆఖరు నాటికి 100 బిలియన్ డాలర్లు సాధిస్తాం
- ఇంధన వారోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- పెట్టుబడులతో ముందుకు రావాలని వ్యాపారవేత్తలకు పిలుపు


5



## వీబీ జీ రామ్‌జీపై చర్చ కుదరదు

- ఎస్ఐఆర్ సర్వే పైనా చర్చించడానికి ఏమీ లేదు
- స్పష్టంచేసిన మోదీ సర్కార్
- అఖిలపక్ష భేటీలో అన్నిపార్టీల సహకారం కోరిన కేంద్రం
- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్న రాష్ట్రపతి
- ఫిబ్రవరి ఒకటిన బడ్జెట్
- తొలిసారిగా ఆదివారం పద్దును ప్రవేశపెట్టనున్న మంత్రి నిర్మల

# ఫిబ్రవరి 11న పుర పోరు





## 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరగనున్న ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. నేటి నుంచి ఈ నెల 30 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- ఒకే విడతలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు
- 13న ఓట్ల లెక్కింపు, 16న కొలువుదీరనున్న కొత్త పాలక మండళ్లు..
- నేటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి..
- ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని వెల్లడి

హైదరాబాద్

రాష్ట్రంలోని 116 మున్సి పాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఈ నెల 28న బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. బుధవారం నుంచే ప్రారంభమయ్యే నామినేషన్ల స్వీకరణ ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. 31న నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్ల తిరస్కరణ, ఉపసంహరణ గడువు (ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు) ముగిసిన తర్వాత ఫిబ్రవరి 3వ తేదీన పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. అదే నెల 11న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒకే విడతలో బ్యాలెట్ విధానంలో పోలింగ్ నిర్వహిస్తారు. 13న ఓట్లు లెక్కించి అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు. - మిగతా2లో



## 93% వస్తువులపై సుంకాలు ఎత్తివేత

- భారత్, ఈయూ నడుమ ప్రపంచ చరిత్రలోనే భారీ వాణిజ్య ఒప్పందం
- ఈయూ నేతలతో ఫలించిన మోదీ చర్చలు..
- ఆర్నెల్లలో సంతకాలు, ఏడాదిలోపు అమల్లోకి
- ట్రంప్ టారిఫ్‌లకు సరైన సమాధానం: విశ్లేషకులు

5

## మేడారం జాతర వైభవంగా జరుపుకోవాలి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్

ప్రపంచంలోనే అతిపెద్ద జాతరగా, తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం మహా జాతరను వైభవంగా జరుపుకోవాలని ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మ గౌరవానికి ప్రతీకలుగా కొలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర శుభాకాంక్షలను తెలిపారు. జాతర ఏర్పాట్లపై అవసరమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఫోన్‌లో ఆదేశించారు. పెద్ద సంఖ్యలో భక్తులు జాతరకు వస్తున్నందున.. - మిగతా2లో

# ఆ పెద్దాయన కేసీఆరేనా?

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రస్తావనకు వచ్చిన 'పెద్దాయన' ఎవరు? అప్పటి సీఎం కేసీఆరేనా? మావోయిస్టుల పేరు చెప్పి.. రివ్యూ కమిటీ కళ్లకు గంతలు కట్టి.. వేలాది మంది రాజకీయ నేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తల ఫోన్లను అనధికారికంగా ట్యాపింగ్ చేయించి.. వారిపై నిఘా పెట్టించడం అంతా కేసీఆర్‌కు తెలిసే జరిగిందా? లేక కేసీఆర్ మాట అంటూ ఆయన పేరిట మీరే అధికారులకు ఫోన్లు చేశారా? ఎస్ఐబీ లేదా టాస్క్‌ఫోర్స్ అధికారులను మీరు ఏయే విషయాల కోసం సంప్రదించేవారు? ఆనాటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు పదవీ విరమణ పొందిన తరువాత.. వారి కొనసాగింపునకు ఆదేశాలు ఎలా వచ్చాయి? నాటి డీజీపీతో కేసీఆర్ ఆదేశాలంటూ మాట్లాడింది ఎవరు? అంటూ సిట్ అధికారులు.. బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌రావుపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం కేసీఆర్ సన్నిహితుడైన సంతోష్‌రావును వారు విచారించారు. మధ్యాహ్నం 3 గంటలకు సిట్ కార్యాలయానికి వచ్చిన సంతోష్‌రావును రాత్రి 10.30 గంటల దాకా సుదీర్ఘంగా విచారించారు. ఆనాటి సీఎం కేసీఆర్ తరఫున సంతోష్‌రావు అన్నీ తానై చక్రం తిప్పిన నేపథ్యంలో.. ఆయన నుంచి కీలక విషయాలు రాబట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం. విచారణలో పూర్తిగా కేసీఆరే లక్ష్యంగా ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించిన సిట్ అధికారులు.. నాలుగు వైపుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీంతో ఇక తదుపరి నోటీసు కేసీఆర్‌కేనని సిట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, ఈలోపు వీలుంటే కవిత, ఆమె భర్త అనిల్‌కుమార్‌ను విచారించే అవకాశాలూ కనిపిస్తున్నాయి.

**సాక్ష్యాధారాలతో విచారణ..**

ఫోన్ ట్యాపింగ్‌కు మూలమైన రాజకీయ కోణాలను బయటపెట్టే క్రమంలో సంతోష్‌రావు విచారణ ముఖ్యమైనదని సిట్ అధికారులు భావిస్తున్నారు. అందుకే అత్యంత పకడ్బందీగా, సాక్ష్యాధారాలతో సహా ఆయనను విచారించారు. నాటి సీఎంవోలో ఆదేశాలు ఇచ్చే విధానం, అధికారులకు నేరుగా ఫోన్లు చేయడం తదితర అంశాలపై సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ కేసులో అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో పేర్కొన్న 'పెద్దాయన' విషయాన్ని, నిఘా పెట్టాల్సినవారి ఫోన్ నంబర్లు సీఎంవో ద్వారా కాగితపు చిట్టీల్లో తమకు అందేవన్న విషయాన్ని నిర్ధారించుకోవడానికి సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే పెద్దాయన అంటే కేసీఆర్ కదా! అంటూ సంతోష్‌రావును సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతోపాటు ఆనాటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు..



ఇంటెలిజెన్స్ విభాగం బాధ్యతలను కూడా చూసిన నేపథ్యంలో ఆయనకు నాటి ముఖ్యమంత్రి ఆదేశాలు ఎలా వెళ్లేవో తెలుసుకోవడానికి సిట్ అధికారులు పలు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. అప్పట్లో కేసీఆర్‌ను ఎవరు కలవాలన్నా సంతోష్‌రావు అనుమతి ఉంటేనే సాధ్యపడేదన్న ప్రచారాన్ని గుర్తు చేస్తూ.. 'అంతా మీరే చక్కదిద్దారు కాబట్టి అసలు సంగతి చెబితే బాగుంటుంది' అంటూ సిట్ అధికారులు కొంత మెత్తగా మాట్లాడుతూనే.. కీలక సాక్ష్యాధారాలను, కొన్ని వాట్సాప్ చాట్లు, వాట్సాప్ కాల్ డిటైల్స్‌ను ఆయన ముందు పెట్టి ఉక్కిరిబిక్కిరి చేశారని తెలుస్తోంది.

**కీలకం కానున్న సంతోష్ జవాబులు**

ఇప్పటివరకు జరిగిన విచారణలో అనధికార ఫోన్ ట్యాపింగ్ ఎలా జరిగిందన్న విషయంపై సిట్ అధికారులు కొంత స్పష్టతకు వచ్చారు. అయితే ఈ ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎలా వచ్చాయి? అన్నదానిపై స్పష్టత వచ్చేందుకు సంతోష్‌రావు సమాధానాలు కీలకం కానున్నాయని సీనియర్ పోలీసు అధికారులు అంటున్నారు. ఇందుకోసం.. ఈ కేసులో అరెస్టయిన పోలీసు అధికారులు రాధాకిషన్‌రావు, తిరుపతన్న, భుజంగరావు, ప్రణీత్‌రావుతోపాటు విచారణ ఎదుర్కొంటున్న ప్రభాకర్‌రావుతో.. సంతోష్‌రావు పలుమార్లు నేరుగా మాట్లాడిన విషయాలను సిట్ అధికారులు ప్రస్తావించినట్లు తెలిసింది. కింది స్థాయి పోలీసు అధికారులతో మాట్లాడాల్సిన అవసరమేంటని వారు ఆరా తీసినట్లు సమాచారం. ఈ క్రమంలో నాటి సీఎం కేసీఆర్ ఆదేశాలతో మీరు ఎస్ఐబీ లేదా టాస్క్‌ఫోర్స్ అధికారులను ఏయే విషయాల కోసం సంప్రదించేవారు? లేదా నాటి కమిషనర్‌కు, డీజీపీకి చెప్పి ఊరుకునేవారా? అంటూ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మొత్తంగా విచారణ అత్యధికంగా కేసీఆర్ చుట్టూనే తిరగడంతో అనేక ప్రశ్నలకు సంతోష్‌రావు సమాధానాలు ఇవ్వలేదని సమాచారం.

**ఇక కేసీఆర్ వంతు?**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ తుది దశకు చేరుకోవడం, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావు విచారణ ముగియడంతో.. తదుపరి సిట్ నోటీసులు మాజీ సీఎం కేసీఆర్‌కు అందవచ్చని తెలుస్తోంది. అయితే కేసీఆర్‌ను విచారించడానికి పూర్తిస్థాయి సాక్ష్యాధారాలను సేకరించిన తర్వాతే ముందుకెళ్లాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ఒకదాని తరువాత మరో కోణంలో విచారణ పూర్తి చేసుకుంటూ ఆధారాలను సేకరించుకుంటూ వచ్చారు. వాటన్నింటి ఆధారంగా కేసీఆర్‌ను ప్రశ్నించడానికి సన్నద్ధమవుతున్నారు. కేసీఆర్‌ను ప్రశ్నించడానికి ముందు.. ఇప్పటివరకు జరిగిన విచారణపై మరోసారి పోలీసు ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, అనుచరులతోపాటు బీజేపీ అగ్రనాయకులైన బండి సంజయ్, ఈటల రాజేందర్ తదితరుల ఫోన్ నంబర్లను ట్యాపింగ్ చేయించడం, టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ కేసు విచారిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి, ఆయన కుటుంబసభ్యుల ఫోన్లను ట్యాపింగ్ చేయించడం, పలువురు జర్నలిస్టులు, సెలబ్రిటీలు, పారిశ్రామికవేత్తలపై నిఘా పెట్టిన అంశాలపై సిట్ అధికారులు విచారణ జరిపారు. ఎవరి ఆదేశాలతో ఇవన్నీ జరిగాయన్నది నిర్ధారించేందుకు వివిధ కోణాల్లో ఇప్పటికే సాక్ష్యాధారాలను సేకరించారు. ఈ క్రమంలో కేసీఆర్‌ను విచారణకు పిలవాలా? లేక ఆయన ఫాంహౌసకు వె ళ్లి వాంగ్మూలాన్ని నమోదు చేయాలా? అనే అంశంలో త్వరలో సిట్ ఒక నిర్ణయం తీసుకోవచ్చునని తెలుస్తోంది.

# పురపోరుకు బీజేపీ సన్నాహాలు

హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. మంగళవారం షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో యావత్ పార్టీ యంత్రాంగం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని మె జారిటీ స్థానాలు గెలిచేలా అన్నిస్థాయిల్లో సమన్వయంతో ముందుకెళ్లాలని తీర్మానించింది. బుధ, గురువారాల్లో నామినేషన్ల దాఖలు సమయం ముగియనున్నందున వెంటనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. తొలుత నోవాటెల్‌లో నిర్వహించిన సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, రాష్ట్రపార్టీ ఇన్‌చార్జి అభయ్ పాటిల్, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులతో జాతీయ నాయకత్వం నియమించిన ఇతర రాష్ట్రాలకు చెందిన మున్సిపల్ ఎన్నికల సహ ఇన్‌చార్జీలు సమావేశమయ్యారు. రాత్రి పొద్దుపోయేదాకా నోవాటెల్‌లోనే రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జీలతో పార్టీ నేతలు రాంచందర్ రావు, కిషన్‌రెడ్డి, అభయ్ పాటిల్, డీకే అరుణ, కె.లక్ష్మణ్ ఇతర ముఖ్యనేతలు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి అనుసరించాల్సిన వ్యూహాలు, కేంద్ర మంత్రులు, జాతీయ పార్టీ ముఖ్య నేతలతో రెండేసి



ఉమ్మడి జిల్లాలకు ఒకటి చొప్పున బహిరంగ సభ నిర్వహణ, తదితర అంశాలపై చర్చించారు.

విజయసంకల్ప సమావేశాలు: రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బీజేపీ మహిళామోర్చా, ఎస్టీ మోర్చాల ఆధ్వర్యంలో విజయసంకల్ప సమావేశాలు జరిగాయి. మహిళా మోర్చా సన్నాహక సమావేశంలో రాంచందర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వీరేందర్ గౌడ్‌తోపాటు ఎన్నికల కో ఇన్‌చార్జి, రాజస్థాన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అశోక్ పర్ణామి, మరో కోఇన్‌చార్జి, ఎంపీ రేఖాశర్మ, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి పాల్గొన్నారు.

# చరిత్రకు ప్రతిరూపం 'పడిగ'

భద్రాద్రి కొత్తగూడెం:

మేడారం సమ్మక్కసారలమ్మ జాతరంటే గుర్తొచ్చే గద్దెలు, బంగారం (బెల్లం), ఒడి బియ్యం వంటివి చాలా మందికి తెలుసు. కానీ కళ్లెదుటే కనిపిస్తున్నా ఆదివాసేతర భక్తులకు అంతగా తెలియని మరో ముఖ్యమైన అంశం పడిగలు. ఆదివాసీ జాతరల్లో పడిగల ప్రాముఖ్యత ఏంటి? వాటిని ఎక్కడ, ఎలా తయారు చేస్తారనే అంశాలు 'సాక్షి'పాఠకుల కోసం.. ఆదివాసీల గొట్టు గోత్రాలు, ఇలవేల్పులు, వీరగాథలకు సంబంధించిన సమాచారం ఎక్కువగా కథలు, పాటల రూపంలో మౌఖికంగా అందుబాటులో ఉంది. కొన్నిచోట్ల గోడలపై బొమ్మల రూపంలో చెప్పే ఆనవాయితీ కూడా ఉంది. తర్వాత కాలంలో ఆదివాసీల వంశచరిత్ర, ఇలవేల్పుల ఔన్నత్యాన్ని చిహ్నాలు, బొమ్మలతో తెలియజేసేలా రూపొందించిన వస్త్రాన్నే పడిగ (దేవరగుడ్డలు) అంటారు. వాటిని తయారు చేసే తోలెం వంశీయుల కుటుంబం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం ఎలుకలగూడెంలో ఉంది. ఆదివాసీల్లో ఒక తెగకు సంబంధించిన ఇలవేల్పు, ఆ తెగ వంశ చరిత్రను తెలిపే వ్యక్తిని అర్తిబిడ్డ (ఉదా: పద్మశ్రీ సకిని రామచంద్రయ్య) అంటారు. ఆ తెగకు సంబంధించిన ఇలవేల్పుకు పూజలు చేసే వ్యక్తిని తళపతి అంటారు. పడిగ తయారీకి ముందు తళపతి, అర్తిబిడ్డలు తోలెం కుటుంబాన్ని కలుస్తారు. పాటలు, కథల రూపంలో తమ తెగకు సంబంధించిన వంశ చరిత్ర, ఇలవేల్పులకు సంబంధించిన అంశాలపై చర్చిస్తారు. ఇందులో వచ్చిన వివరాల ఆధారంగా పడిగలపై ఏ చిహ్నాలు, ఏ జంతువులు, ఏ చెట్లు, ఏ పక్షులు, ఏ నక్షత్రాలకు చెందిన గుర్తులు, బొమ్మలు ఏ వరుసలో అమర్చాలనే అంశంపై స్పష్టత వస్తుంది. పడిగ తయారీపై స్పష్టత వచ్చిన తర్వాత పూజా కార్యక్రమాలను నిర్వహించి 'దేవనిష్ట'లో ఉంటూ ఎర్రని వస్త్రంపై ఆయా చిహ్నాలు, బొమ్మలను ఒక క్రమపద్ధతిలో కుడతారు!

## ఫిబ్రవరి 11న పుర పోరు

-మొదటిపేజీ తరువాయి

16వ తేదీన కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని ఈ మేరకు షెడ్యూల్‌ను ప్రకటించారు. పురపాలక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, శాంతిభద్రతల అదనపు డీజీపీ మహేశ్ భగవత్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి లింగ్యా నాయక్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఎన్నికల కమిషనర్ మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డితో ఎన్నికల సంఘం కార్యాలయంలో భేటీ అయ్యారు. కాగా షెడ్యూల్ విడుదల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది.

**భారీ పోలీసు బందోబస్తు**

ఎన్నికల ప్రక్రియను పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ కేంద్రాల నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నామినేషన్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ జరుగుతుంది. అటవీ, ఎక్సైజ్ విభాగాల సిబ్బందితో కలిసి సుమారు 25 వేల మంది పోలీసులు ఎన్నికల బందోబస్తులో పాల్గొంటారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా 1,800 ఆయుధాలు డిపాజిట్ అయ్యాయి. ఇప్పుడు కూడా పట్టణ ప్రాంతాల్లోని లైసెన్స్ హోల్డర్లు ఆయుధాలు డిపాజిట్ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బందితో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, చెక్‌పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేస్తున్నారు. రూ.50 వేలకు మించి నగదుతో పట్టుబడితే స్వాదీనం చేసుకుని రశీదు ఇవ్వడంతో పాటు అప్పీలు వివరాలు కూడా తెలియజేస్తారు. ఇప్పటికే గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల పరిధిలో బందోబస్తు పెంచడంతో పాటు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తారు. 1,926 పోలింగ్ స్టేషన్లు సున్నితమైనవిగా, 1,302 అత్యంత సమస్యాత్మకమైనవిగా, 4,975 సాధారణమైనవిగా గుర్తించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్, నిజామాబాద్, బోధన్ తదితర మతపరమైన సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరిస్తారు. రాష్ట్రంలోని మొత్తం 133 మున్సిపాలిటీలకు గాను ప్రస్తుతం పాలక మండళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో మాత్రమే ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు పారదర్శకంగా స్వేఛ్చాయుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించారు.

## నేటి నుంచే మేడారం మహాజాతర

-మొదటిపేజీ తరువాయి

పసుపు, కుంకుమ ఇస్తారు. దీన్ని తీసుకొని వారు పూనుగొండ్లకు బయల్దేరుతారు. ఇదే సమయంలో పూనుగొండ్లలోని పెనక వంశీయులైన వెంకటేశ్వర్లు ఇంట్లో ఉన్న పూజా సామగ్రి, పానుపు, పడిగెలను శుద్ధి చేశారు. అనంతరం (నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, మువ్వలు) సిద్ధం చేసి తళపతి ఇంట్లో పెనక వంశీయులు ప్రధాన పూజారి రాజేశ్వర్, బుచ్చిరాములు, పురుషోత్తం, రాహుల్, వెంకటేశ్, సురేందర్, సమ్మయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయంలో మొక్కులు సమర్పించి దేవునిగుట్ట నుంచి వనం (వెదురు చెట్టు) తీసుకుని గ్రామ పొలిమేరలో పడిగెను కలిపి ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకొచ్చారు. వనాన్ని తాకితే మంచి జరుగుతుందనే నమ్మకం. దీంతో భక్తులు వనాన్ని తాకడానికి పోటీ పడ్డారు.

**పగిడిద్దరాజును తీసుకెళ్లేందుకువచ్చిన మంత్రి, అధికారులు**

సమ్మక్క తరఫున గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతోపాటు మేడారం ట్రస్టుబోర్డు చైర్మన్ సుకన్య, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ కల్యాణి, సమ్మక్క వంశీయులు పూనుగొండ్లకు వచ్చారు. తంతు ముగిశాక మేడారానికి పగిడిద్దరాజు (ప్రతిమ)ను తీసుకొని కాలి నడకన మేడారం బయల్దేరారు. మంగళవారం రాత్రి వరకు కర్లపల్లి లక్ష్మీపురం గ్రామంలో బస ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం రాళ్లవాగులో స్నానం చేసి సాయంత్రానికి మేడారం చేరుకోనున్నారు. సారలమ్మను కన్నెపల్లి నుంచి మేడారం తీసుకొచ్చే వేడుకను చూసేందుకు భక్తులు తరలివస్తున్నారు. సమ్మక్కసారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపై ఉండే శుక్రవారం మేడారం భక్తులతో నిండిపోనుంది. శనివారం దేవతల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది.

**జాతరను వైభవంగా జరుపుకొందాం**

ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా ఖ్యాతిగాంచిన మేడారం మహాజాతరను నాలుగు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మగౌరవానికి ప్రతీకలుగా కొలిచే సమ్మక్కసారలమ్మ జాతరను వైభవంగా జరుపుకోవాలని పిలుపునిస్తూ రాష్ట్ర ప్రజలకు శు భాకాంక్షలు తెలియజేశారు. కోటిన్నర మందికిపైగా భక్తులు తరలివచ్చే జాతరకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఘనంగా ఏర్పాట్లు చేసి నిధులు వెచ్చించామని తెలిపారు. రూ. 250 కోట్లతో ఆలయ ప్రాకారం విస్తరణతోపాటు సమ్మక్కసారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను విశాలంగా నిర్మించామన్నారు. లక్షలాదిగా నిరంతరం మేడారం తరలివస్తున్న భక్తులకు ఇబ్బంది లేకుండా రోడ్లు, శాశ్వత మౌలిక వసతుల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందన్నారు. కోటిన్నర మందికిపైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో పనిచేయాలని, భక్తులకు ఇబ్బందుల్లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అమెరికా నుంచి సీఎం ఫోన్లో ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా, 13 వేల మంది పోలీసులతో జాతర భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే మేడారాన్ని సుమారు 45 లక్షల మందికిపైగా భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం నుంచే మేడారం భక్తజనంతో కిక్కిరిసింది.

## మేడారం జాతర వైభవంగా జరుపుకోవాలి

-మొదటిపేజీ తరువాయి



అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. "కోటిన్నర మందికి పైగా భక్తులు తరలివచ్చే జాతరకు రాష్ట్రప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా ఘనంగా ఏర్పాట్లు చేసింది. చరిత్రలో నిలిచిపోయే విధంగా మేడారం ఆలయాన్ని రాష్ట్రప్రభుత్వం పునర్నిర్మించింది. రూ.250 కోట్లతో ఆలయ ప్రాకార విస్తరణతో పాటు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను విశాలంగా నిర్మించాం. గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా గద్దెల ప్రాంగణాలను ఆధునికీకరించాం. సమ్మక్క, సారలమ్మల స్ఫూర్తిగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తాం. జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు భక్తులు సహకరించాలి" అని రేవంత్ పేర్కొన్నారు.

**ఏర్పాట్లు పూర్తి: మంత్రి సీతక్క**

మేడారం మహాజాతరకు తరలివచ్చే భక్తుల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రవాణా, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులు సమకూర్చామని పేర్కొన్నారు. జాతర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆమె మాట్లాడారు. భక్తులందరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని సురక్షితంగా తిరిగి వెళ్లాలని కోరారు.

